# అబద్ధంకాదు నిజం

అది మైలాపూరులోని ఒక తెలుగు కొంప. ఆ ఇంటి యజమానురాలు చాలా పూర్వకాలపు మనిషి - అంటే మంచిదన్నమాట.

ఆవిడ పేరు మంగమ్మ. తన ఇంటికివచ్చే దాసీవాళ్ళ పేర్లు సాధారణంగా రుక్మిణి, ధనలక్ష్మి, అంబుజం, లక్ష్మి, పార్వతి మొదలయినవిగా వుంటూంటాయి—ఇంటి యజమానురాలే మంగమ్మగా తృప్తిపడి వూరుకుంటే ఈ దాసీముండలు అంతంత పేర్లెట్టుకుని అలా మిడిసి పడతారేం ?

మంగమ్మకి వాళ్ళనిచూస్తే అరికాలి మంట నెత్తికెక్కింది.

దీనితోడు వీళ్ళ సంగీతాలు ! ఇంతంతలేసి ముండకి సంగీతం ! పాటలు ! కూనిరాగాలు ! ఇన్నాళ్ళు వచ్చికూడా తను ఒక్కపాట-ఒక్కటంటే ఒక్కపాట - ఎప్పుడైనా పాడిందా ? అసలు తనకు పాడటమే చేతగాందే ?

అందర్నీ మానిపించేసింది మంగమ్మ. ఆ మర్నాడు ఇంకోపిల్ల వచ్చింది. ఇది కొంచెం నెమ్మదైనదే.

'నీ పేరెవరు ?'

'కృష్ణవేణి.'

ఆ దెబ్బతో సగం చచ్చింది మంగమ్మ. తెగించి మరో ప్రశ్న వేసింది.

'ఆ మెళ్ళోవున్న చెయిను నీ కెట్లావచ్చిందీ ?'

'రేడియోలో పాడితే యిచ్చారు.' మంగమ్మ ముఖం ఎర్రబడింది.

'నేనైతే తలగొరిగించి ఇంటిలో కూచోబెడుదును - నీకు సాయం రేడియోలో పాట ఒకటా - పద శీఘ్రం అవతలికి పద. ఇంక నేను దాసీదాన్ని పెట్టుకుంటే ఒట్టు.'